క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



ఎమ్మెల్యే హరీశ్‌రావును సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని లింగారెడ్డిపల్లిలో భక్త ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఉదయం నుంచే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అయితే ఈ కార్యక్రమాని ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రాంరెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రాంరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని తిగుల్‌లో పర్యటించారు. ఈ మేరకు వర్షానికి కూలిన ఇళ్లు, మురుగు కాల్వల దుస్థితి, మట్టి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య నిర్మూలనకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. దోమల నివారణకు ఆయిల్ బాల్స్‌తో పాటు మందులను పిచికారీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేందర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే



ప్రమాద సూచికగా ఏర్పాటు చేసిన కర్రలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పట్టణంలోని గొల్లపల్లి చౌరస్తాలో రోడ్డుపై గుంతలు పడడంతో వర్షపు నీరు నిలిచింది. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చేసేది ఏమీలేక ప్రయాణికులే ప్రమాద సూచికగా చెట్టు కొమ్మను అమర్చారు. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు కొనసాగిస్తుంటారు. గతంలో ఈ ప్రాంతంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు సైతం చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి గుంతలు పూడ్చివేయాలని కోరుతున్నారు.

లైసెన్స్ రద్దు చేయాలి: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): యూరియాను బ్లాక్ చేసి విక్రయిస్తున్న ఎరువుల దుకాణాల లైసెన్స్ రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో బద్దిపడగ కృష్ణారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు యూరియా అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సత్తిరెడ్డి, రవీందర్, ఇస్తారి, మల్లేశం, పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి



పరిశీలిస్తున్న ఐద్వా అధ్యక్షురాలు శారద

కొమురవెల్లి(సిద్దిపేట): పట్టణంలోని మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలలో డ్రెయినేజీ నీరు ఏరులై పారిన అధికారులు పట్టించుకోవడం లేదని జిల్లా మహిళ సంఘం ఐద్వా కార్యదర్శి అత్తిని శారద అన్నారు. బుధవారం మహిళా సంఘం బృందంతో కలిసి డ్రెయినేజీ ప్రవహిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

కొరవడిన పర్యవేక్షణ

- 8 నెలలుగా నిలిచిన చెత్త సేకరణ
- వ్యాధుల భయంతో గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

దుబ్బాకటౌన్: గ్రామాలను చెత్త కమ్మేసింది. చెత్త సేకరణపై అధికారుల పర్యవేక్షణ కొరవడంతో గ్రామాల్లో గత 8 నెలలుగా చెత్త పేరుకుపోయింది. దేశానికే గ్రామాలు పట్టుకొమ్మలని, పచ్చదనం, పరిశుభ్రతతో గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిద్దేందుకు ప్రతీ గ్రామంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణకు ట్రాక్టర్లను కొనుగోలు చేసి వాటి నిర్వహణ గ్రామ పంచాయతీలకు అప్పగించింది. ఆనాటి నుంచి గ్రామాల్లో ప్రజలు రోడ్లపై, వీధుల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా తడి, పొడి చెత్త వేరు చేసి ఇచ్చే విధంగా మున్సిపల్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఇలా ప్రతిరోజు ట్రాక్టర్లు ఇంటింటికీ తిరుగుతూ చెత్త సేకరణ చేస్తూ గ్రామాల్లోని డంపింగ్ యార్డ్‌కు తరలించేవారు. దీంతో వీధుల్లో చెత్త చెదారం నిలవకుండా ఆస్కారం ఉండేది.

నిలిచిన నిధులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో చెత్త సేకరణ నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం లోటు బడ్జెట్‌లో ఉందని గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వడం లేదు. దీంతో గ్రామాల్లో ఎలాంటి పనులు జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. మురుగు కాల్వల శుభ్రం, దోమలు, ఈగల నివారణకు మందుల పిచికారీ, వీధి దీపాలు ఏర్పాటు, మంచినీటి సమస్యలు కూడా సక్రమంగా జరగడం లేదని వాపోతున్నారు.



మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో రోడ్డుపై నిలిచిన నీరు



పొదల్లో గ్రామ పంచాయతీ ట్రాక్టర్

మూలకే పంచాయతీ ట్రాక్టర్

చెత్త సేకరణ నిలిచిపోవడంతో చెత్తను సేకరించే ట్రాక్టర్లు సైతం మూలన పడుతున్నాయి. రాయపోల్ మండల పరిధిలోని ముంగిస్‌పల్లి గ్రామ పంచాయతీ చెత్త ట్రాక్టర్‌ను గత కొంతకాలంగా వాడకపోవడంతో వర్షాలకు గడ్డి, పిచ్చి మొక్కలు, చెట్లు ఏపుగా పెరిగి ట్రాక్టర్‌ను కప్పివేశాయి. 8 నెలల నుంచి ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ చేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

నిమ్మకు నీరెత్తినట్లు అధికారుల తీరు

గ్రామంలో చెత్త సేకరణ యథావిధిగా నిర్వహించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి, మండల అధికారులకు విన్నవించుకున్న నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం పొంచి ఉందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కంపు కొడుతున్నాయి



చెత్త సేకరణ జరగకపోవడంతో ప్రజలు ఎక్కడపడితే అక్కడే చెత్త వేస్తున్నారు. దీంతో రోడ్లన్నీ కంపు కొడుతున్నాయి. మరోవైపు ఈగలు, దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అధికారులు తిరిగి ట్రాక్టర్‌ను నడిపి చెత్త సేకరణ చేయాలి. – నర్సయ్య, దుబ్బాక

త్వరలోనే చేపడుతాం



ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాల్లో చెత్త సేకరణ చేపడుతున్నాం. ముంగిస్‌పల్లిలో ట్రాక్టర్ మరమ్మత్తుల కారణంగా నడపలేకపోయాం. త్వరలో పారిశుద్ధ్య పనులు యథావిధిగా కొనసాగిస్తాం. – బాలయ్య, ఎంపీడీఓ, రాయపోల్



సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

ములుగు(గజ్వేల్): విద్యార్థులకు సైకిళ్లు అందించడం అభినందనీయమని ఎంఈఓ ఉదయ్‌భాస్కర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ లక్ష్మక్కపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామీణ ప్రాంతాలనుంచి ప్రతిరోజు కాలినడకన పాఠశాలకు వచ్చే బాలికల ఇబ్బందులను లయన్స్ క్లబ్ గుర్తించి 15 మంది విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేసిందన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ అమర్‌నాథ్‌రావు, లయన్ జ్యోతి, పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ సూర్యరాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సవాలను ప్రశాంతంగా చేసుకోవాలి



కోహెడలో మాట్లాడుతున్న ఎస్‌ఐ అభిలాష్

కొమురవెల్లి(సిద్దిపేట): గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ రాజు అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. గణేష్ మండపాల నిర్వాహకులు విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలన్నారు.

మండపాల ఏర్పాటు స్థలాల పరిశీలన

కోహెడ(హుస్నాబాద్): వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ అభిలాష్ సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వాహకులతో ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ తిలక్, పీసీలు కుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: శాంతియుత వాతావరణంలో పండుగలు చేసుకోవాలని ఏసీపీ సదానందం అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయక మండపాల నిర్వాహకులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వినాయక మండపాల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచి అనుమతి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి

హుస్నాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ దూర దృష్టితో సెల్ ఫోన్, ఇంటర్నెట్ సౌకర్యం లాంటివి కల్పించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారన్నారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందు, నాయకులు రవీందర్, ఎండీ హస్సెన్, వెంకటరమణ, వీరన్న, నర్సాగౌడ్, బీక్యా నాయక్, రాజు, కిష్టస్వామి, రాజిరెడ్డి , నాయకులు తదితరులు ఉన్నారు.

ఘనంగా రాజీవ్ జయంతి

దుబ్బాక: మండల కేంద్రంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, శంకర్, ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొండపాక(గజ్వేల్): మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డులో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగారావు, కనకరాములు, మల్లికార్జున్, రవీందర్, రాజు, చిరంజీవి, రాజశేఖర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

జగదేవ్‌పూర్(గజ్వేల్): సమాజంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే బాధ్యత అందరిపై ఉందని ఎంఈఓ మాధవరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నవభారత్ సాక్షరతా, ఉల్లాస్ కార్యక్రమంపై గ్రామైక్య సంఘాల సభ్యులకు, ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులు, వలంటీర్లను జతపరిచి అభ్యసనా కార్యక్రమాలకు ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం: ఎంఈఓ

దౌల్తాబాద్ (దుబ్బాక): మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంఈఓ ఆధ్వర్యంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గజ్జెల కనకరాజు మాట్లాడుతూ అక్షరాస్యత శాతాన్ని పెంచే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలలలోని నిరక్షరాసులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ మేరకు విద్యార్థులకు భారత ప్రభుత్వం సర్టిఫికెట్ ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, వేణు, సుధాకర్ రెడ్డి, పెంటయ్య, శేఖర్, మల్లేషం, సీఆర్‌పీలు రాజు, చంద్రమౌళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ మాధవరెడ్డి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉల్లాస్ కార్యక్రమ నిర్వహణపై ఎంఈఓ బచ్చలి సత్తయ్య ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌పై గులాబీ జెండా ఎగరాలి

మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్

హుస్నాబాద్: రానున్న స్థానిక ఎన్నికల్లో మున్సిపల్‌లోని అన్ని వార్డుల్లో గులాబీ జెండా ఎగరవేయాలని మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం బీఆర్‌ఎస్ పట్టణ ముఖ్య నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించేలా పని చేయాలన్నారు. అనంతరం వివిధ పార్టీల నుంచి వచ్చిన నాయకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, చంద్రయ్య, ఆకుల రజిత తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని పీఆర్టీయూ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న తలపెట్టిన మహాధర్నా వాల్ పోస్టర్లను మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర బాధ్యుడు మధుసూదన్‌రెడ్డి, బాలకిషన్, జిల్లా బాధ్యులు జ్యోతి, మండల బాధ్యుడు చంద్రం తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

సిద్దిపేటరూరల్: సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పీఆర్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని చింతమడకలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాజిరెడ్డి, పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు వెంకటనర్సారెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీశైలం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీహరి, మహేందర్‌రెడ్డి, లక్ష్మన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సేవలు భేష్

దౌల్తాబాద్ (దుబ్బాక): విద్యుత్ ఉద్యోగుల సేవలు భేష్ అని దౌల్తాబాద్ విద్యుత్ ఉద్యోగులు మరోసారి నిరూపించారు. మండల పరిధిలోని దీపాయంపల్లిలోని లైన్ చెరువులో స్తంభంపై ఇన్సులేటర్ ఫెయిల్ కావడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో చెరువును సైతం లెక్కచేయకుండా విద్యుత్ సిబ్బంది చెరువులో ఉన్న స్తంభం ఎక్కి 33 కేవీ ఇన్సులేటర్ మార్చి విద్యుత్ సరఫరా జరిగేలా చేశారు. దీంతో ప్రజలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మెన్ రాజేషం, ఏల్ఎం సుభాష్, అజయ్, రవీందర్, రాకేష్, జేల్ఎం నజీర్, రాజశేఖర్, సీఎల్ శ్రీమాన్, నర్సింలు పాల్గొన్నారు.



ఇన్సులేటర్ మారుస్తున్న ఉద్యోగులు



బోనాలతో వస్తున్న మహిళలు

బోనాల సందడి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రావణ మాసం సందర్భంగా జిల్లా కేంద్రంలో లాల్ కమాన్ గడిమైసమ్మ బోనాలను ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి మహిళలు బోనాలతో లాల్ కమాన్ వరకు ఊరేగింపుతో వచ్చారు. అనంతరం గడి మైసమ్మ అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. దీంతో పట్టణంలో బోనాల సందడి నెలకొంది. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. గడి మైసమ్మ దీవెనతో అందరూ సంతోషంగా ఉండాలన్నారు.



గజమాలతో ఎమ్మెల్యే హరీశ్‌రావును సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

రైతుల పేరిట రాజకీయాలు మానుకోవాలి

కాంగ్రెస్ నేతల ఆగ్రహం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌లు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బీహార్ ఎన్నికల్లో రైతుల నుంచి ఓట్లు రాబట్టేందుకు కేంద్రం ఎరువులను తరలించారని ఆరోపించారు. రైతులకు సకాలంలో ఎరువులకు అందించకుండా కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై నింద వేస్తుందన్నారు. రైతుల పేరుతో బీఆర్‌ఎస్ రాజకీయాలు చేయవద్దని, ధర్నాలు రాస్తారోకోలు ఢిల్లీలో చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, లక్ష్మి, ఆనంద్, రియాజుద్దీన్, ఖలీముద్దీన్, మహేందర్, రాజ్ బహదూర్ రెడ్డి, గయాజుద్దీన్, హర్షత్, పవన్, సంతోష, నజ్జు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రభుత్వంపై విమర్శలు అర్థరహితం

మిరుదొడ్డి(దుబ్బాక): యూరియా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్‌స్వామి గౌడ్ ఖండించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీల పోరాటంతోనే కేంద్రం మరో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కమలాకర్, నాయకులు బాలు, వెంకటేశం, రమేష్, నర్సాగౌడ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నిబంధనలు పాటించకుంటే చర్యలు

గజ్వేల్‌రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మురళి అన్నారు. ఇటీవల గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో 11మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ సందర్భంగా బుధవారం వారిని జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట హాజరుపరిచామన్నారు. విచారణ అనంతరం 11 మందికి రూ. 17వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

◆ యూరియా పంపిణీ పరిశీలన

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రంలోని సహకార సంఘం వద్ద పంపిణీ చేస్తున్న యూరియాను బుధవారం తహసీల్దార్ చంద్రశేఖర్, ఏఓ సంతోష్ పరిశీలించారు. అనంతరం యూరియా పంపిణీ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం సిబ్బంది బుచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.

◆ మండల ప్రత్యేక అధికారిగా భాగ్యలక్ష్మి

బెజ్జంకి(సిద్దిపేట): మండల ప్రత్యేక అధికారిగా సిద్దిపేట జెడ్పీ డిప్యూటీ సీఈఓ భాగ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి వంట సరుకులు, విద్యార్థుల గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, ఎంపీఓ మంజుల, వార్డెన్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

◆ రెవెన్యూ డివిజన్ చేయాలని వినతి

దుబ్బాక: దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని మండల డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో మంత్రి వివేక్‌కు బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. అసెంబ్లీ ఎన్నికల ఎదుట దుబ్బాకలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి డివిజన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని మంత్రికి విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు శ్రీకాంత్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

◆ నాణ్యమైన ఆహారం అందించాలి

దుబ్బాక: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని డీఏసీఓ, మండల స్పెషల్ ఆఫీసర్ తనూజ ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి భోజనంతో పాటు పలు సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కరశర్మ తదితరులు ఉన్నారు.

◆ పాములపర్తిలో సీతారాముల కల్యాణం

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పాములపర్తిలో సీతారామ కల్యాణం నిర్వహించారు. ఈ మేరకు పునర్వసు నక్షత్రం సందర్భంగా బుధవారం మ్యాకల చంద్రకళ, కనకయ్య దంపతులు, నాచారం దేవాలయం మాజీ చైర్మన్ హరిపంతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ మాజీ చైర్మన్ వంటేరూ ప్రతాప్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ పార్టీ కార్యాలయం ప్రారంభం

నంగనూర్(సిద్దిపేట): మండల కేంద్రంలో బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సారయ్య, పీఏసీఎస్ చైర్మన్ రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సోమిరెడ్డి, భుపేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ కోమటిచెరువు పరిశీలన

సిద్దిపేటజోన్: వినాయక చవితి సందర్భంగా నిమజ్జనం ముందస్తు ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ బుధవారం కోమటిచెరువు పరిశీలించారు. ఈ మేరకు మాజీ చైర్మన్ రాజనర్స్, మున్సిపల్ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం నిమజ్జనం స్థల పరిశీలన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈ ప్రేరణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

◆ రాజయ్య సేవలు అమోఘం..

సిద్దిపేటజోన్: ప్రముఖ అంతర్జాతీయ చిత్రకారుడు కాపు రాజయ్య సేవలు అమోఘమని సిద్దిపేట కవులు పేర్కొన్నారు. కాపు రాజయ్య వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కవులు రాజేశం, రాజ్ కుమార్, అశోక్, రాజయ్య, బాలకిషన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

◆ లింగాకర్షణ బుట్టలతో రైతులకు మేలు

కొండపాక(గజ్వేల్): పత్తి పంటలో గులాబీ పండు పురుగుల నివారణ కోసం లింగాకర్షణ బుట్టలు దోహదపడుతాయని మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రైతు వేదికలో పత్తి పంటలపై అవగాహన కల్పించారు.

◆ మాజీ సర్పంచ్ శ్రమదానం

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రం నుంచి కల్లెపెల్లి వెళ్లే మూలమలుపు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను బుధవారం మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య సొంత ఖర్చులతో మట్టితో పూడ్చివేశారు.

◆ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

గజ్వేల్‌రూరల్: విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి పేర్కొన్నారు. ఈ నెల 30, 31 తేదీల్లో జరగనున్న యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రథమ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రసాద్, కార్తీక్, మహేష్, పాల్గొన్నారు.